తెల్లవార్లూ కుండపోతే.. రైతన్నలకు గుండెకోత!

- బాపట్లలో 21 సెం.మీ. వర్షపాతం
- నీటమునిగిన 10 వేల ఎకరాల వరిపైర్లు
- కొల్లూరు మండలంలో సుమారు 1,500 ఎకరాల మునక
- రేపల్లె నియోజకవర్గంలో పల్లపు ప్రాంతాలు జలమయం

మంగళవారం రాత్రి నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షం రైతాంగాన్ని కష్టాల కడలిలోకి నెట్టేసింది. వరుణుడి ప్రతాపంతో రైతన్నల ఖరీఫ్ సాగు ఆదిలోనే హంసపాదు అన్న చందంగా మారింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నీటమునిగిన పంటలను చూసి కర్షకులు ఆందోళన చెందుతున్నారు. అనావృష్టి పరిస్థితుల్లో పంటలకు సకాలంలో నీరు అందించుకుని పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడే రైతన్నలు నేడు అతివృష్టి కారణంగా మునకకు గురైన పంటలను కాపాడుకునేందుకు రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. అతి భారీగా కురుస్తున్న వానలకు గ్రామాలూ ఏరులను తలపిస్తున్నాయి. ప్రజలు సైతం నానా అవస్థలు పడుతున్నారు.

బాపట్ల టౌన్: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు రైతులను నిండా ముంచేశాయి. బాపట్ల ప్రాంతంలో ఆకాశానికి రంధ్రం పడిందా అనే రీతిలో మూడు రోజుల్లో 21 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. బాపట్ల మండలంలోని చెరువు జమ్ములపాలెం, ఈతేరు, గుడిపూడి, పూండ్ల, మర్రిపూడి, కంకటపాలెం, నరసాయపాలెం, మురుకుంటపాడు, ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, నందిరాజుతోట, కొండుబోట్లవారిపాలెం, పిన్నిబోయినవారిపాలెం, కొత్తమద్దిబోయినవారిపాలెం, అసోదివారిపాలెం, పోతురాజుకొత్తపాలెం తదితర గ్రామాల్లో గడిచిన 10 రోజుల వ్యవధిలో సుమారు 10 వేల ఎకరాల మేరా వెదలు పెట్టారు. కొన్ని పొలాల్లో నాట్లు వేశారు. మొక్క దశలో ఉన్న పొలాలు మొత్తం ముంపునకు గురయ్యాయి. నీటిని బయటకు పంపేందుకు రైతన్నలు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు.

వాణిజ్య పంటలకు స్వల్ప నష్టం..

కొల్లూరు: మండలంలోని కొల్లూరు, రావికంపాడు, క్రాప, ఈపూరు, దోనేపూడి, చిలుమూరు, చినపులివర్రు, అనంతవరం గ్రామాల పరిధిలో 1,000 ఎకరాల విస్తీర్ణంలోని వరిపంట వర్షం కారణంగా నీట మునిగిందని వ్యవసాయశాఖాధికారులు ప్రాథమిక అంచనాల ద్వారా తెలిపారు. కాగా మునకకు గురైన పంట విస్తీర్ణం సుమారు 1,500 ఎకరాల వరకూ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. బలమైన గాలులతో కూడిన వర్షం కారణంగా లంక గ్రామాల్లో సాగులో ఉన్న వాణిజ్య పంటలు నేలకొరిగాయి. దీంతో స్వల్పంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలలోకి మురుగు నీరు..

డ్రైనేజీలు పొంగడంతో కొల్లూరు ఎస్సీ కాలనీ, ఆలపాటినగరం, మగ్గాలపాలెం ప్రాంతాలలోని పలు ఇళ్లల్లో మురుగు నీరు చేరింది. కొల్లూరు ఎస్సీ కాలనీ డ్రైనేజీ పొంగడంతో బీఎస్ఎఫ్ పాఠశాలలోకి బుధవారం మధ్యాహ్నం మురుగుతో కూడిన వర్షపు నీరు తరగతి గదుల వరకూ వెళ్లింది. దీంతో మురుగు మధ్యలోనే పాఠశాల నిర్వహణ చేపట్టంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కుండపోత వర్షానికి మండలంలోని పలు వీధులు కాలువలను తలపించాయి. దీంతో ప్రజలు రాకపోకలు సాగించలేక నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొల్లూరులో మంగళవారం రాత్రి 135.40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నీట మునిగిన పంటలు పరిశీలన


ముత్తాయపాలెంలో నీట మునిగిన వరిపొలాలు


కొల్లూరు దక్షిణపు బజారు ఉప్పువారి వీధిలో నేల కొరిగిన చెట్టు


కొల్లూరు ఎస్సీ ఏరియాలోని బీఎస్ఎఫ్ పాఠశాలలో నిలిచిన నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం..

అమృతలూరు(వేమూరు): వర్షాల వల్ల నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసా [illegible]


పట్టణంలో జోరుగా కురుస్తున్న వర్షం

[illegible] వాహనచోదకులు అసౌకర్యానికి గురయ్యారు. అత్యధికంగా రేపల్లెలో 65.2, నిజాంపట్నం మండలంలో 58.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెరుకుపల్లిలో 37.8.. నగరంలో 35.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.


కొత్తమద్దిబోయినవారిపాలెంలో ముంపులో పొలాలు

కృష్ణా నదికి వరద ఉధృతి

కొల్లూరు: కృష్ణా నదికి వరద ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజీకు ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని దిగువకు సముద్రంలోకి వదులుతుండడంతో జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కృష్ణా నదిలో నీటి పరిమాణం అంతకంతకూ పెరుగుతుంది. ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి ఆర్సీ(రివర్ అండ్ కన్జర్వేషన్) అధికారులు బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 3.61 లక్షల క్యూసెక్కుల నీటిని.. అర్ధరాత్రి 1.22 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. సుమారు 7 లక్షల క్యూసెక్కుల వరద నీటి విడుదల ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద తీవ్రత అధికమైతే కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాలలోని వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండదంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

గతేడాది వరద బకాయిలు చెల్లించాలి

రేపల్లె ఆర్డీవో వద్ద బకాయిదారులు మొర

కొల్లూరు: కృష్ణా నదికి గతేడాది సంభవించిన వరదల సమయంలో పెట్టిన బకాయి బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని బకాయిదారులు రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి వద్ద మొరపెట్టుకున్నారు. కృష్ణా నదికి గతేడాది సెప్టెంబరులో భారీ వరదలు సంభవించాయి. ఈనేపథ్యంలో వరద సమయంలో ప్రభుత్వం తరఫున వరద బాధితులతో పాటు, విధుల్లో ఉన్న అధికార యంత్రాంగానికి భోజన ఏర్పాట్లకు స్థానికంగా ఉన్న హోటళ్లలో అధికారులు పురమాయించారు. వీరితో పాటు వరద సహాయక చర్యలలో పాల్గొనే బోట్లు, అధికారుల వాహనాలకు ఆయిల్‌ను కొల్లూరులోని ఓ పెట్రోల్ బంక్‌లో పోయించుకున్నారు. నిధులు మంజూరైన అనంతరం వీరికి బిల్లులు చెల్లించే ప్రాతిపదికన అధికారులు ఆయిల్, భోజనాల సరఫరా చేయాలని ఆదేశించారు. బుధవారం రేపల్లె ఆర్డీవో రామలక్ష్మిని కలిసి తమ బిల్లులు చెల్లించాలని బాధితులు మొరపెట్టుకున్నారు.

క్లుప్తంగా

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రేపల్లె: ప్రకాశం బ్యారెజీ నుంచి వరద నీరు దిగువకు విడుదల చేసిన నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పెనుమూడి పుష్కర్‌ఘాట్ వద్ద బుధవారం వరద నీటిని ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం 3.32 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం నడుస్తోందని.. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అన్నారు. మండలంలోని నదీ పరివాహక గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. వరద తాకిడి పెరిగితే పెనుమూడి పల్లెపాలెం వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలిరావడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నదీ పరివాహక ప్రాంతాలలోని వీఆర్వోలు, గ్రామనౌకరులు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామనౌకరులు తదితరులు పాల్గొన్నారు.

16న సాధన మండలి బ్రహ్మవిద్యాశ్రమం స్వర్ణోత్సవం


భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం 5 దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 16వ తేదీన స్వర్ణోత్సవం, శ్రీకృష్ణాష్టమి నిర్వహించనున్నట్లు అధ్యక్షులు బూర్లె అరుణకుమారి బుధవారం తెలిపారు. శనివారం జ్యోతి ప్రజ్వలన, గోపూజ, హోమాలు ఉంటాయన్నారు. వ్యవస్థాపకులు, స్థల దాతల వారసులు, విగ్రహ దాతలు, మాజీ అధ్యక్షులు, అతిథులకు సన్మాన కార్యక్రమం.. మధ్యాహ్నం సమారాధన, దీపోత్సవం, కోలాటం, ఉట్టి మహోత్సవం, వసంతోత్సవం, ఊయల సేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉభయ భాషా ప్రవీణ హరి అన్నయ్య శాస్త్రి (శృంగేరి పీఠం-రేపల్లె), ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. గుంటూరు, కృష్ణా జిల్లాలు, దాస సాహిత్య ప్రాజెక్ట్ తిరుమల తిరుపతి దేవస్థానం(తిరుపతి) గడ్డిపాటి శ్రీనివాసరావు(వాసు) కార్యక్రమాలకు విచ్చేయనున్నట్లు ఆమె తెలిపారు.

పెండింగ్ బిల్లులు మంజూరు



వేమూరు: కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో ఎంపీడీవోలు, జాతీయ గ్రామీణ ఉపాధి అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారులతో ఆయన బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2014-19 వ్యవధిలో సిమెంట్ రోడ్లు వేశారని.. వాటి క్వాలిటీ కంట్రోలు పూర్తయిన బిల్లులకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు విడుదల చేసిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



బాపట్ల టౌన్: ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు బుధవారం 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా పోలీస్ అధికారులు విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. వాటికి ఆకర్షితులవుతున్న వారిలో ఎక్కువ శాతం యువత, విద్యార్థులే ఉన్నారన్నారు. విద్యార్థులు మంచి వాతావరణంలో ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు.

నిజాంపట్నం: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని అడవులదీవి ఎస్ఐ బాబురావు తెలిపారు. అడవులదీవి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశాభివద్ధిలో యువత పాత్ర కీలకమని.. మత్తు పదార్థాలకు బానిసలయితే జీవితం అంధకారం అవుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటుదన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల బంగారు భవిష్యత్తు నాశనమవ్వడమే కాక ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, డ్రైవింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు.

సూపర్ సిక్స్ పథకాల పేరుతో మోసం

వేమూరు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ దాది సుబ్బారావు తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మహిళలను చేసిన మోసం గురించి ఆయన వివరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి పోతురాజు, దాది రజినికుమారి, జొన్నకూటి వెంకట నారాయణ, గుమ్మడి సత్యనారాయణ, కొంద్ర శ్రీనివాసరరావు, గుమ్మడి చిన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లూరు: మోసపూరిత హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గుర్రం వీరరాఘవలు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని పోతార్లంకలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేష్, పరిశ రంగారావు, బొల్లెద్దు నాగరాజు, పిల్లి మరియరావు తదితరులు పాల్గొన్నారు.


పెరవలి గ్రామం కార్యక్రమంలో దాది సుబ్బారావు

పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలి

కర్లపాలెం: గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌డీవో విజయలక్ష్మి, డీపీవో కేఎల్ ప్రభాకరరావు తెలిపారు. యాజలి గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని తెలుసుకున్న డీఎల్‌డీవో, డీపీవో బుధవారం యాజలి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్యం పనులు మెరుగుపరచాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. యాజలి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి జ్వరం వచ్చి డెంగీ లక్షణాలున్నాయని సమాచారం రావడంతో అధికారులు యాజలి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. జ్వరాల విషయమై కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గోపీనాథ్‌ను వివరణ అడుగగా సీజనల్‌గా వచ్చే సాధారణ జ్వరాలు వస్తున్నాయని.. అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలున్న వారిని గుర్తించి మందులు అందజేస్తున్నామని తెలిపారు. కర్లపాలెం మండలంలో ఇప్పటి వరకూ డెంగీ కేసులు నమోదు కాలేదని ఆయన అన్నారు.


యాజలిలో పరిసరాలను పరిశీలించిన డీఎల్‌డీవో విజయలక్ష్మి

రహదారిపై వరి నాట్లు వేస్తూ నిరసన

కొల్లూరు: చెరువులను తలపిస్తున్న రహదారులలో ప్రయాణ కష్టాలను తట్టుకోలేని ప్రజలు వినూత్న రీతిలో నిరసనకు దిగారు. మండలంలోని అనంతవరంలో పల్లెపండుగ పేరుతో రహదారి మరమ్మతుల కోసం రోడ్డును పెకలించిన ప్రభుత్వం 8 నెలలుగా ఎటువంటి పనులూ చేపట్టలేదు. దీంతో రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. తటాకాలను తలపిస్తూ రోడ్డుపై గుంతలలో నీరు నిలువడంతో వాహనదారులు ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఆర్అండ్‌బీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో వరుసగా రెండో రోజు అనంతవరం వాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రోడ్డుపై నీటితో నిండిన గుంతలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొనిగల సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.


రోడ్డు గుంతలో నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న స్థానికులు

వరినాట్లు వేసే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

నగరం: వరినాట్లు వేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.ఉషా తెలిపారు. మండలంలోని తోటపల్లిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఉషా మాట్లాడుతూ.. నాట్లు వేసే సమయంలో వరినారు చివరలను కత్తిరించాలన్నారు. కాండం తొలిచే పురుగు ఆకు చివరిన గుడ్లు పెడతాయని అందుకు చివరలు తుంచాలని అన్నారు. అతిగా ఎరువులు వినియోగించకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మి, ఏవో రమేష్‌బాబు, ఏఈవో నాగశ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి: రైతులు మునిగిన పొలాల్లోని నీటిని వెంటనే బయటకు తీసివేయాలని బాపట్ల డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా సూచించారు. బుధవారం మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు రేపల్లె వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. మొదటి దఫా ఎరువు వేసేటప్పుడు ఎకరాకు 15 కేజీలు పొటాష్ ఎరువు కూడా వేసుకోవాలని తెలిపారు. రైతులకు ఎరువుల కొరత లేదని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మి అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకృష్ణ, వ్యవసాయ సహాయకులు కేవీ ద్రాక్షాయణి, బి.రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త ఉషా

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన



నగరం: పోక్సో చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీం ఇన్‌చార్జి, నగరం ఎస్ఐ బండ్ల భార్గవ్ తెలిపారు. మండలంలోని పెద్దవరం జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం పోక్సో చట్టం, శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ.. లైంగిక వేధింపులు, బెదిరింపులు, ఇతర అత్యవసర సమయాల్లో శక్తి యాప్ దోహదపడుతుందన్నారు. అనంతరం యాప్ డౌన్‌లోడింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, వంటి వాటిపై ఆయన అవగాహన కల్పించారు.

పాఠశాలకు వెళ్లే దారేదీ!



అమర్తలూరు(వేమూరు): వర్షాల సమయంలో రోడ్ల గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అమర్తలూరు మండల కేంద్రం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి మరీ అధ్వానంగా మారింది. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే మురుగులో నడవాల్సి పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే స్పందించి లింక్ రోడ్లు వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ముంపు నీటిలో రాకపోకలు!



బాపట్ల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలోకి నీరు చేరింది. దీంతో స్థానికులు మురుగులోనే రాకపోకలు సాగిస్తున్నారు. అధికంగా వర్షం నీరు కాలనీలోకి చేరడంతో కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. కాలనీ వాసులు కాలు బయట పెట్టడానికి కూడా వీలు లేకుండా ఇళ్ల చుట్టూ నీళ్లు చేరాయి. వర్షాలతో విద్యుత్ సరఫరా కూడా అంతరాయం ఏర్పడడంతో చీకట్లో బిక్కుబిక్కుమంటూ స్థానికులు బతుకుతున్నారు. నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి కూడా బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తమ గురించి పట్టించుకోవాలని వేడుకుంటున్నారు.

కూచిపూడిలో రక్షాబంధన్ కార్యక్రమం

అమృతలూరు(భట్టిప్రోలు): శ్రీ లక్ష్మీ అమ్మవారిని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర సహ సంయోజక్ ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరామ్ తెలిపారు. ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రావణమాసం పురస్కరించుకుని అమృతలూరు మండలం కూచిపూడి గ్రామంలో రక్షా బంధన్ వారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాయిరామ్ మాట్లాడుతూ.. ధర్మ రక్షణకు పాటు పడాలని అన్నారు. ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు యేమినేని శ్రీనివాసరావు, నాగవేణి పాల్గొన్నారు.

రేపల్లె: ఆలయ కేంద్రంగా హిందూ ధర్మ రక్షణ జరగాలని సాయిరామ్ అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని కొత్తపాలెం శ్రీ కోదండ రామాలయంలో బుధవారం సామూహిక హారతుల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ శ్రీనివాసుల శ్రీనివాస్, సహ కన్వీనర్ రాయపూడి అంకమ్మ చౌదరి, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మోదడుగు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు 6,357 ఎకరాల పైరు మునక

కర్లపాలెం: కర్లపాలెం మండల పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరిపైర్లు నీట మునిగాయి. మండలంలోని రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌కు సుమారుగా 8,640 ఎకరాల్లో వరిపైర్లు సాగు చేశారు. మండలంలో సోమవారం, మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు సుమారుగా 6,357 ఎకరాలలో వరిపైరు నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకున్న రైతులు శ్రమించి సాగుచేసిన పైర్లు నీట మునగటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి, నర్రావారిపాలెం, గణపవరం, పెదగొల్లపాలెం, పేరలి, చింతాయపాలెం, కర్లపాలెం, నందాయపాలెం, ఏట్రవారిపాలెం, బుద్ధాం, యాజలి, దుండివారిపాలెం, నాగరాజుపాలెం, దమ్మనవారిపాలెం గ్రామాల్లో అధిక శాతం మంది రైతులు ఈ ఏడాది వెద పద్ధతిలో వరి సాగు చేశారు. ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా పొలాలు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీట మునిగిన వరిపొలాలను పరిశీలించిన ఏవో సుమంత్‌కుమార్ నీట మునిగిన వరి పైరును రక్షించుకునేందుకు రైతులు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలని తెలిపారు.


పెదగొల్లపాలెంలో పూర్తిగా నీట మునిగిన వరిపైర్లు

నదీ పరివాహక ప్రజల క్షేమంపై దృష్టి సారించాలి

కొల్లూరు: కృష్ణా నదికి వరదలు వచ్చే సూచనలు అధికంగా ఉన్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రజల క్షేమంపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. బుధవారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి వరద ప్రభావిత గ్రామాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై పలు సూచనలు చేశారు. వరద తీవ్రత పెరిగిన తరుణంలో ముందుగా మండలంలోని పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల చుట్టూ వరద నీరు చేరే సూచనలున్నట్లు తాము గుర్తించామన్నారు. మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద నదిలో వరద పరిస్థితిని ఆమె పరిశీలించారు. అనంతరం గాజుల్లంకలో పర్యటించి ప్రజలను చైతన్య వంతులను చేయడంతో పాటు, మత్స్యకారులను తమ పడవలతో వరద సమయంలో తగిన సేవలు అందజేసేందుకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పెసర్లంక అరవింద వారధి వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న రామలక్ష్మి

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

చెరుకుపల్లి: గ్రామ స్థాయి అధికారులు గ్రామాల్లోని ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఎంపీడీవో షేక్ మహబూబ్‌సుభాని తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో డెంగీ, ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడానికి పోస్టర్లు వచ్చాయన్నారు. వీటిని అధికారులు ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు



వేమూరు: అల్ప పీడనం ప్రభావంతో రాత్రి కురిసిన వర్షాలకు మండలంలోని పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అప్పు చేసి పంటలు వేశామని.. నష్ట పరిస్థితిలో తాము ఉన్నామని రైతన్నలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.